సాక్షి ఒడిశా

సోమవారం । 4 । ఆగస్టు । 2025



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు : రూ. 7,34,211

బంగారం : 1 గ్రాము 420 మిల్లీ గ్రాములు

వెండి : 92 గ్రాముల 100 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ

చోరీ కేసులో నిందితుని అరెస్టు

రాయగడ: ఒక చోరీ కేసుకు సంబంధించి పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. అరెస్టయిన వ్యక్తి స్థానిక ఇందిరానగర్ మూడో లైన్‌లో నివాసం ఉంటున్న బడుమూరు మనికంట్ సుబుద్ధిగా గుర్తించారు. అతని నుంచి రూ.32 వేల నగదు, స్టీల్ బాక్స్‌లో రూ.600, ఒక బంగారు లాకెట్, బంగారు పూత గల ఆభరణం, వెండి పట్టీలు, 40 వెండి కాయిన్లు, 8 వెండి ఆభరణాలు, రెండు రోల్డ్ గోల్డ్ ఆభరణాలు, ఒక మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు. పోలీస్ స్టేషన్ ఐఐసీ ప్రసన్న కుమార్ బెహరా తెలియజేసిన వివరాల ప్రకారం ...గత నెల 26న స్థానిక పంచవటి నగర్‌లో నివాసం ఉంటున్న జి.గంగారావు అనే వ్యక్తి ఇంటిలో చోరీ జరిగింది. దీనిపై బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు ఈ మేరకు దర్యాప్తు చేపట్టారు.

న్యూస్‌రీల్

11 నుంచి మినిస్టీరియల్ ఉద్యోగుల సామూహిక సెలవు



సమావేశంలో ఉద్యోగ సంఘాల ప్రతినిధులు

పర్లాకిమిడి: ఈ నెల 11వ తేదీన నుంచి రెవెన్యూ మినిస్టీరియల్ ఉద్యోగులు సామూహిక సెలవలోకి వెళ్లాలని నిర్ణయించారు. ఒడిశా రెవెన్యూ మినిస్టీరియల్ సంఘం నాయకులు స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆదివారం అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో జిల్లాలో పనిచేస్తున్న రెవెన్యూ ఉద్యోగులకు సంబంధించి దీర్ఘకాలంగా ఉన్న తొమ్మిది డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చనందున గజపతి జిల్లా రెవెన్యూ సంఘం అధ్యక్షులు జుధిస్టర్ రణసింగ్, కార్యదర్శి సంతను మిశ్రా 11వ తేదీ నుంచి నిరవధికంగా సామూహిక సెలవు ఆందోళనలో వెళుతున్నామని ప్రకటించారు. దీనికి జిల్లాలోని రెవెన్యూ సంఘం సభ్యులు, ఉద్యోగులు సహకరించాలని కోరారు. ఒడిశా రెవెన్యూ మినిస్టీరియల్ సంఘం ఉద్యోగులకు ఓఆర్ఎస్‌పీ-2017 నియమావళి ప్రకారం జీతాలను తొమ్మిది లెవల్‌కు పెంచాలని, పాత పింఛన్ విధానం అమలు, ప్రభుత్వ ఉద్యోగులకు రూ. 20 లక్షల వరకూ ఆరోగ్యశ్రీ కార్డులు, 1990 ప్రభుత్వం అమలు చేసిన నియమావళి ప్రకారం విధి నిర్వాహణలో మృతి చెందిన కుటుంబాలకు యోగ్యాతాను సారం ఉద్యోగం ఇవ్వాలన్న డిమాండ్‌లను పరిష్కరించాలని కోరుతూ ప్రభుత్వ ఉద్యోగులు ఆందోళన జరుపుతున్నారు. జూన్ మాసంలో నల్లబ్యాడ్జిలు ధరించి పదిరోజుల పాటు నిరసన ఆందోళన కార్యక్రమం కూడా చేపట్టారు. అయితే ప్రభుత్వం డిమాండ్ల పరిష్కారానికి ముందుకు రాకపోవడంతో రాష్ట్ర రెవెన్యూ ఉద్యోగుల సంఘం ఆదేశాల మేరకు ఆందోళనకు తప్పడం లేదని జిల్లా అమలా సంఘం కార్యదర్శి సంతను మిశ్రా తెలియజేశారు.

1300 కిలోల గంజాయి స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయితో ఉన్న బస్తాలు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి బోడిగేట పంచాయతీ టేక్‌గూఢ గ్రామ అటవీ ప్రాంతంలో శనివారం రాత్రి కలిమెల పోలీసులు దాలు నిర్వహించి భారీగా గంజాయి బస్తాలను పట్టుకున్నారు. పెట్రోలింగ్‌కు కలిమెల ఐఐసీ ముకుందో మేల్కా నేతృత్వంలో సిబ్బంది వెళ్లగా వారికి రోడ్డు పక్కన అటవీ ప్రాంతంలోని ఓ చోట అనుమానాస్పదంగా కొని బస్తాలు కనిపించారు. దీంతో వారు అక్కడికి వెళ్లి పరిశీలించగా బస్తాల్లో గంజాయి ఉండటాన్ని గుర్తించారు. దీంతో వాటిని స్వాధీనం చేసుకొని పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ బస్తాలను ఎవరు ఇక్కడ ఉంచారో ఆరా తీస్తున్నారు. ఆదివారం ఉదయం గంజాయిని తూకం వేయగా 52 బస్తాల్లో 1300 కిలోలు ఉన్నట్టు నిర్ధారించారు. బహిరంగ మార్కెట్లో దీని విలువ సుమారు రూ. 80 లక్షలు ఉంటుందని ఐఐసీ ముకుందో మేల్కా విలేకరులకు తెలిపారు.

గుమ్మలో.. ఘోర రోడ్డు ప్రమాదం

జేసీబీ సాయంతో ఇంటి శిథిలాలను తొలగిస్తున్న దృశ్యం





ఇంటిలోకి దూసుకుపోయిన ట్యాంకర్

- జనావాసాల్లోకి దూసుకుపోయిన భారీ ట్యాంకర్
- ఒకరి మృతి.. మరో ఇద్దరికి గాయాలు
- నష్టపరిహారం చెల్లించాలని రాస్తారోకో



లక్ష్మీ పాత్రో మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు



ఆందోళనకారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రియదర్శిని స్వయి



గాయాలతో కరుణాకర్ పాత్రో



గాయాలతో ట్యాంకర్ డ్రైవర్



రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు

రాయగడ: సదరు సమితి కుంభికోట పోలీస్ స్టేషన్ పరిధిలో గల గుమ్మ గ్రామంలో ఆదివారం తెల్లవారున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. టికిరి నుంచి వస్తున్న ఒక భారీ ట్యాంకర్ గుమ్మ ఘాటి దిగుతుండగా అదుపు తప్పి సరాసరి జనవాసాల్లోకి దూసుకుపోయింది. ఈ ఘటనలో లక్ష్మీ పాత్రో (61) సంఘటన స్థలం వద్దే మృతి చెందగా ఆమె భర్త కరుణాకర్ పాత్రో, ట్యాంకర్ డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. సమాచారుం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు, బాధితులు తెలియజేసిన వివరాల ప్రకారం..

అంతా నిద్రిస్తున్న సమయంలో పెద్ద శబ్దం రావడంతో అంతా ఉలిక్కిపడ్డారు. భారీ ట్యాంకర్ గుమ్మ గ్రామం రోడ్డుకు పక్కనే ఉన్న జనావాసాల్లోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో ఒక ఇల్లు మరో రెండు దుకాణాలు ధ్వంసమయ్యాయి. లక్ష్మీ పాత్రో, ఆమె భర్త కరుణాకర్ పాత్రో ఇంటిలో నిద్రిస్తుండగా ట్యాంకర్ ఢీకొనడంతో ఇల్లు పూర్తిగా ధ్వంసమైంది. ఇంటి శిథిలాలు, ట్యాంకర్ మధ్యలో ఇరుక్కుపోయిన కరుణాకర్‌ను అదేవిధంగా ట్యాంకర్ డ్రైవర్‌ను అగ్నిమాపక సిబ్బంది అతి కష్టం మీద బయటకు తీసుకురావడంతో వారు ప్రాణాలతో బయటపడ్డారు. శిథిలాల్లో ఇరుక్కుపోయిన లక్ష్మీపాత్రో మృతదేహాన్ని రెండు గంటల తర్వాత జేసీబీ సాయంతో శిథిలాలను తొలగించాక బయటకు తీశారు.

నష్ట పరిహారం చెల్లించాలని రాస్తారోకో

ఈ ప్రమాదంలో మృతి చెందిన లక్ష్మీపాత్రో కుటుంబానికి నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. గుమ్మ గ్రామం రహదారిపై అడ్డుకట్టలను వేసి టైర్లను తగులబెట్టి రాస్తారోకో చేపట్టారు. దీంతో రాయగడ మీదుగా ఇటు కొరాపుట్, లక్ష్మీపూర్ అదేవిధంగా కాశీపూర్, టికిరి ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వందలాది వాహనాలు దారి పొడవునా నిలిచిపోవడంతో రాయగడ తహసీల్దార్ ప్రియదర్శిని స్వయి సంఘటన స్థలానికి చేరుకుని బాధిత కుటుంబీకులకు నచ్చజెప్పారు. అనంతరం లక్ష్మీపూర్ ఎమ్మెల్యే రఘురాం మచ్చ , రాయగడ నుంచి బీజేపీ నాయకుడు యాల్ల కొండబాబులు గుమ్మ గ్రామానికి చేరుకున్నారు. ఆందోళనకారులతో బాధిత కుటుంబీకులతో మాట్లాడారు. తగిన నష్ట పరిహారాన్ని ప్రభుత్వం చెల్లించే విధంగా కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

నకిలీ హనుమాన్ ముద్ర విక్రయం కేసులో ముగ్గురి అరెస్టు



పోలీసులకు పట్టుబడిన నిందితులు



స్వాధీనం చేసుకున్న నగదు, ఇతర సామగ్రి

రాయగడ: పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ప్రజలకు నకిలీ హనుమాన్ ముద్రను చూపించి వారి నుంచి డబ్బులు కాజేస్తున్న ముగ్గురు వ్యక్తులను సదరు పోలీసులు శనివారం అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. అరెస్టయిన వారిలో ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లా అమలాపురం మండలం బందరాలులంక గ్రామానికి చెందిన పలంపూరి డేవిడ్ రాజు, ఒడిశాలోని నవరంగపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తోటవీధికి చెందిన విక్టర్ కింగ్ జెంగీస్ రాయ్ కొర్, సంజయ్ జెన్నలు ఉన్నారు. నిందితుల నుంచి ఒక హనుమాన్ కాంస్య ముద్ర, 77 వేల రుపాయల నగదు, ఇత్తడి ప్లేటు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్టు సదరు పోలీస్ స్టేషన్ ఐఐసి ప్రశన్న కుమార్ బెహెర తెలిపారు. పట్టణంలోని తుండిగుడ పరిసర ప్రాంతాల్లో కొందరు హనుమాన్ ముద్ర క్రయవిక్రయాలు చేస్తున్నారన్న సమాచారం మేరకు దాడులు చేసి ముగ్గురిని అరెస్టు చేసినట్టు పేర్కొన్నారు.

మేరింగి గ్రామానికి చేరుకున్న వైద్య బృందం



గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరం



గ్రామస్తులతో మాట్లాడుతున్న వైద్య బృందం



మేరింగి గ్రామంలో మురికి కాలువను పరిశీలిస్తున్న దృశ్యం



ఇంటింటా తిరిగి జ్వరాలపై అప్రమత్తత గురించి వివరిస్తున్న వైద్యులు

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ సబ్ డివిజన్ పరిధిలో గల ఘనాంత్రి పంచాయతీలోని మేరింగి గ్రామాన్ని జ్వరాలు పీడిస్తున్నాయని 'సాక్షి'లో ఆదివారం కథనం ప్రచురితమైంది. దీంతో జిల్లా యంత్రాంగం స్పందించింది. ఆదివారం నాడు వైద్య బృందం ఆ గ్రామంలో పర్యటించాయి. ఇంటింటా తిరిగి గ్రామస్తుల ఆరోగ్య సమాచారాన్ని సేకరించారు. వారు వినియోగిస్తున్న తాగునీటిని పరిశీలించారు. అదేవిధంగా మురికి కాలువల పరిస్థితిని చూసి అవగాహన కల్పించారు. పరిసరాలు శుభ్రంగా ఉంచాలని చైతన్య పరిచారు. అనంతరం గ్రామస్తులతో వైద్య బృందం కాసేపు మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. జ్వరాలు, డయేరియా వంటివి వ్యాపించడానికి గల కారణాలను వివరించారు. ఎలాంటి అనారోగ్య సమస్య వచ్చినా ఆస్పత్రికి వెళ్లి చూపించుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అనంతరం వైద్య శిబిరాన్ని నిర్వహించి అనారోగ్యంగా ఉన్న వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. రాయగడ జిల్లా అదనపు ముఖ్య వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ కుమార్ సుబుద్ధి నేతృత్వంలో డాక్టర్ రాధాకృష్ణ సేనాపతి, ఆరోగ్యగ్య కార్యకర్తలు, టెక్నీషియన్లు తదితరులు మేరింగి గ్రామంలో పర్యటించిన వైద్య బృందంలో ఉన్నారు.

ఓటీఈటీ ప్రశ్న పత్రం లీక్

- బీఎస్ఈ ఉపాధ్యక్షుడు నిహార్ రంజన్ మహంతి అరెస్టు



బినయ్‌తోష్ మిశ్రా, క్రైమ్ శాఖ డైరెక్టరు జనరల్



నిహార్ రంజన్ మహంతి, బీఎస్ఈ ఉపాధ్యక్షుడు

భువనేశ్వర్: ఒడిశా టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (ఓటీఈటీ) ప్రశ్న పత్రం లీక్ కేసులో రాష్ట్ర మాధ్యమిక విద్యా బోర్డు (బీఎస్ఈ) ఉపాధ్యక్షుడు నిహార్ రంజన్ మహంతిని క్రైమ్ శాఖ ఆది వారం అరెస్టు చేసింది. ఈ వ్యవహారంలో ఇదో కీలక పరిణామంగా దర్యాప్తు సంస్థ క్రైం శాఖ పేర్కొంది. క్రైం శాఖ దర్యాప్తులో భాగంగా నిహార్ రంజన్ మహంతిని శనివారం ప్రశ్నించిన తర్వాత ఈ అరెస్టు జరిగింది. ఈ పరిణామంతో మొత్తం అరెస్టుల సంఖ్య ఎనిమిదికి పెరిగింది. పరీక్షా బోర్డుతో కలిసి పనిచేసే డేటా ఎంట్రీ ఆపరేటర్ ద్వారా ప్రశ్న పత్రం లీక్ వ్యూహం పకడ్బందీగా కొనసాగిందని దర్యాప్తులో తేలింది. ప్రధాన నిందితుడు, డేటా ఎంట్రీ ఆపరేటర్ జితన్ మహరణ ఈ లీక్‌లో కీలక పాత్ర పోషించాడని క్రైమ్ శాఖ డైరెక్టరు జనరల్ బినయ్ తోష్ మిశ్రా విలేకర్లకు తెలిపారు. జతిన్ మహరణతో బీఎస్ఈ ఉపాధ్యక్షుడు నిహార్ రంజన్ మహంతికి సంబంధం ఉన్నట్లు విచారణలో ధ్రువీకరించారు.

2, 3 నెలల్లో వీరివురు 100 సార్లు సంభాషించినట్లు ఫోన్ ట్రాకింగ్‌లో తేలింది. అతని ల్యాప్‌టాప్ నుంచి ప్రశ్న పత్రం లీకైంది. ఇది బాధ్యతారాహిత్యానికి అద్దం పడుతుందన్నారు. ఈ నిర్లక్ష్యంతో ప్రశ్న పత్రం లీకేజీ జరిగిందని డైరెక్టరు జనరల్ వివరించారు. వరుసగా 4 సార్లు నిహార్ రంజన్ మహంతిని విచారణలో ప్రశ్నించిన మేరకు అందిన సమాచారం, ఆధారాల బలంతో అరెస్టు చేసినట్లు డైరెక్టరు జనరల్ వివరించారు. ఈ మధ్య కాలంలో జతిన్ మహరణ ఖాతాకు రూ. 2.4 లక్షలు బదిలీ అయ్యాయని క్రైమ్ శాఖ వర్గాలు నిర్ధారించాయి. లీక్ కేసులో ఇటీవల ఏడుగురిని అరెస్టు చేశారు. ప్రశ్న పత్రం బహిర్గతం కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా సర్వీసులో ఉన్న ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల కోసం జూలై 20న జరగాల్సిన ప్రత్యేక ఓటీఈటీ–2025 పరీక్ష రాత్రికి రాత్రి వాయిదా వేసినట్లు ప్రకటించారు.ఈ ఊహాతీత పరిణామంతో 75,000 మందికి పైగా అభ్యర్థులను దిగ్భ్రాంతి చెంది నిరాశకు గురయ్యారు. ప్రత్యేక ఒడిశా టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ పరీక్ష కోసం రాష్ట్ర వ్యాప్తంగా 30 జిల్లాల్లో 193 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ పరీక్ష రాసేందుకు సమగ్రంగా 75,403 మంది ఇన్ సర్వీస్ ప్రాథమిక ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్నారు.

చెరువులో మొసళ్లు!

- ఆందోళనలో ప్రజలు



మోటార్ బోటుతో గాలిస్తున్న అటవీ సిబ్బంది



మొసళ్ల కోసం చెరువులో వల వేసిన దృశ్యం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి యం.వి.83 గ్రామంలోని చెరువులో రెండు మొసళ్లు ఉన్నట్టు స్థానికులు గుర్తించారు. అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు శనివారం సాయంత్రం చెరువు వద్దకు చేరుకొని పరిశీలించారు. చెరువులో ఎవరూ దిగవద్దని సూచిస్తూ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. మొసళ్ల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం రోజంతా మొసళ్ల కోసం మోటార్ బోటుతో గాలించారు.

నిరాహార దీక్ష తాత్కాలిక విరమణ



రన్నింగ్ సిబ్బంది నిరవధిక నిరాహార దీక్ష శిబిరం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లోకో పైలెట్ సంజయ్ మహరణ



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లోకో పైలెట్ బిశాల్ కుమార్

భువనేశ్వర్: తూర్పు కోస్తా రైల్వే లోకో పైలెట్లు నిరాహార దీక్షను తాత్కాలికంగా విరమించారు. డిమాండ్ల సాధన నేపథ్యంలో ఆందోళన చేపట్టిన లోకో పైలెట్ల వర్గంతో మండల రైల్వే అధికారులు సమావేశమై డిమాండ్లపై సానుకూలంగా స్పందించనున్నట్లు హామీ ఇవ్వడంతో ఆందోళనను తాత్కాలికంగా 2 వారాలపాటు వాయిదా వేసినట్లు ప్రకటించారు. ఆందోళన చేపట్టిన వారిలో ముగ్గురు లోకో పైలెట్లు ఆకస్మిక అస్వస్థతకు గురయ్యారు. వారిని ఆస్పత్రికి తరలించి సత్వర చికిత్స కల్పించారు.

తూర్పు కోస్తా రైల్వే శ్రామిక్ కాంగ్రెస్, గార్డ్స్ మండలి, అఖిల భారత లోకో రన్నింగ్ సిబ్బంది సంఘం (ఏఐఎల్ఆర్ఎస్ఏ) సంయుక్తంగా జూలై 31న ఉదయం 10 గంటల నుండి ఖుర్దారోడ్ లోకో షెడ్ క్రూ కంట్రోల్ కార్యాలయం ఎదురుగా నిరవధిక శిబిరం ఏర్పాటు చేసి ఆందోళనకు దిగారు. రెండు రోజులపాటు నిరాహార దీక్ష నిరవధికంగా కొనసాగడంతో ముగ్గురు ఆందోళనకారులు అస్వస్థతకు గురై ఆస్పత్రి పాలయ్యారు. ఈ పరిస్థితుల దృష్ట్యా స్థానిక మండల కార్మిక అధికారి ప్రమోద్ కుమార్ బెహెరా నిరసన స్థలానికి చేరి ఆందోళనకారులకు నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు. పాక్షికంగా అంగీకరించినా.. కనీస హామీ మైలేజ్ (ఎంజీకే) డిమాండు పూర్తి స్థాయిలో అమలుజేస్తామని అధికారి హామీ ఇచ్చారు. ఇతర డిమాండ్లని పరిశీలించిన మేరకు సానుకూల చర్యలు చేపడతామని అభయం ఇచ్చి ఆందోళనకారులకు పండ్ల రసం అందజేసి ఆందోళనకు తెర దించారు.


నిరవధిక నిరాహార దీక్ష శిబిరంలో పాల్గొన్న ముగ్గురు లోకో పైలెట్లు విశాల్ కుమార్, కమలకాంత్ సాహు, సంజయ్ కుమార్ మహరణ అస్వస్థతకు గురయ్యారు. వారందర్నీ స్థానిక ఆస్పత్రిలో చేర్పి చికిత్స కల్పించారు. వైద్యుల సలహా మేరకు ఆహారం స్వీకరించేందుకు ఈ ముగ్గురు నిరాకరించారు. అధికారిక హామీతో ఆందోళన తాత్కాలికంగా వాయిదా పడడడంతో కార్మిక నాయకులు ఆస్పత్రి సందర్శించి వీరికి పండ్ల రసం అందజేసి ఆందోళన విరమింపజేసినట్లు శ్రామిక్ కాంగ్రెసు నాయకుడు లక్ష్మీధర మహంతి తెలిపారు. తూర్పు కోస్తా రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రమేష్ చంద్ర సాహు ఆధ్వర్యంలో తూర్పు కోస్ట్ రైల్వే పరిధిలోని మూడు మండలాల్లో లోకో క్రూ కంట్రోల్ కార్యాలయాలు ఖుర్దారోడ్, జఖ్‌పురా, తాల్చేర్, పారాదీప్, సంబల్‌పూర్, టిట్లాగడ్, విజయనగరం మరియు విశాఖపట్నం ప్రాంతాలలో నిరవధిక నిరాహార దీక్షని ఏకకాలంలో ఆరంభించారు. తేలికపాటి పొరపాటులకు కఠిన క్రమశిక్షణ చర్యల్ని నిరసనకారులు తీవ్రంగా ఖండించారు. పైలెట్లు, గార్డులకు చేయూతగా బాక్స్ బాయ్‌ల నియామకం పునరుద్ధరణ మౌలిక గుర్తింపుగా పరిగణించాలని యాజమాన్యంపై ఒత్తిడి పెంచారు. పరిమిత పని వేళలతో విశ్రాంతి కోసం సముచిత విరామ సౌకర్యాలు కల్పించడంలో అధికార యంత్రాంగం విఫలం అవుతుందని ఆరోపించారు.

చేతబడి చేశాడనే గోపాల్ మల్లిక్ హత్య

- కేసులో 14 మంది నిందితుల అరెస్టు



రచ్చగుడ చేతబడి హత్యా ఘటనలో అరెస్టయిన నిందితులు



విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ జ్యోతీంద్ర పండా

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో మారుమూల గ్రామంలో చేతబడుల్లాంటి మూఢనమ్మకాలు ఇంకా ఉన్నాయని రచ్చగుడ గ్రామంలో జరిగిన ఘటన నిరూపిస్తోంది. మోహన బ్లాక్ రచ్చగుడ గ్రామంలో సుభాష్ మల్లిక్ భార్యను చేతబడి చేశాడన్న అనుమానంతో గోపాల్ మల్లిక్‌ను హత్య చేసి హరభంగి డ్యామ్‌లో విసిరేసిన ఘటనలో 14 మందిని అరెస్టు చేసినట్టు ఎస్పీ జ్యోతింద్ర పండా ఆదివారం డీపీఓ కార్యాలయం(రాణిపేట)లో విలేకరుల సమావేశంలో వెల్లడించారు. వివరాలు ఇలా ఉన్నాయి. గజపతి జిల్లా మోహన బ్లాక్‌కు 26 కిలోమీటర్ల దూరంలో ఉన్న రచ్చగుడ గ్రామంలో పదిహేను రోజుల కిందట సుభాష్ మల్లిక్ భార్య చనిపోయింది. అయితే ఆమెను చేతబడి చేశాడని రచ్చగుడ గ్రామవాసి గోపాల్ మల్లిక్‌పై సుభాష్ మల్లిక్, గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేశారు. దీంతో గోపాల్ మల్లిక్ తనకు ప్రాణభయం ఉందని తెలిసి ఊరువదిలి బోడోఘోడో గ్రామానికి వెళ్లిపోయాడు. కొన్నిరోజుల తర్వాత స్వగ్రామం రచ్చగుడలో ఉన్న తన ఆవులు, మేకలను బోడోఘోడోకు తరలించి అక్కడే స్థిరపడటానికి ప్లాన్ చేశాడు. అనుకున్నట్టుగానే తన బావమరిదితో రచ్చగుడకు 5 కిలో మీటర్ల దూరంలో తన పశుసంపద తీసుకువస్తే అక్కడి నుంచి తోలుకు వెళతానని చెప్పడంతో ఈ సమాచారం అందుకున్న గ్రామస్తులు అక్కడ మాటువేసి గోపాల్ మల్లిక్‌ను పట్టుకుని గ్రామంలో ఒక చీకటి గదిలో కట్టివేసి తీవ్రంగా కొట్టి, మర్మాంగాన్ని చితగ్గొట్టి, చేతులు కాళ్లు కట్టివేసి అడవ వద్ద హరభంగి డ్యామ్‌లో ఈ శనివారం రాత్రి పారవేశారు. ఈ సమాచారం అందుకున్న అడవ, మోహన పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని అక్కడి నుంచి పారిపోతున్న కొందరిని పట్టుకున్నారు. ప్రత్యక్షంగా పాల్గొన్న నిందితులు ఆరుగురు, పరోక్షంగా సహాయపడిన మరో 8 మందిని మోహన పోలీసులు అరెస్టు చేశారు. ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను సోమవారం కోర్టులో హాజరు పరచుతున్నట్టు స్పీ జ్యోతింద్ర పండా తెలిపారు.

క్లుప్తంగా

వివాహిత ఆత్మహత్యాయత్నం



అపస్మారకస్థితిలో పడివున్న మహిళ

టెక్కలి రూరల్: మండలంలోని డమర గ్రామ సమీపంలో రహదారి పక్కన ఒక మహిళ నోటినుంచి నురగలు కక్కుకుని అపస్మారక స్థితిలో పడి ఉండడాన్ని స్థానికులు ఆదివారం గుర్తించి టెక్కలి పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ఆ మహిళను 108లో టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మెళియాపుట్టి మండలం బావనాపురం గ్రామానికి చెందిన దుంప అనూష అనే వివాహిత తన ఆరోగ్య పరిస్థితి సరిగా లేదని మనస్థాపంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించినట్లు పోలీసులు తెలిపారు. ఆమె అత్తవారిది పలాస పట్టణం కాగా, తన భర్త పనికోసం ఇతర దేశానికి వెళ్లాడు. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నట్లు స్థానికులు తెలిపారు.

వైఎస్సార్‌సీపీలో పలువురి చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరినవారితో కేవీజీ సత్యనారాయణ

సరుబుజ్జిలి: మండలంలోని పురుషోత్తపురం గ్రామానికి చెందిన పలు కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో ఆదివారం చేరాయి. వీరికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో బగాది రామారావుతోపాటు మరో నాలుగు కుటుంబాలు ఉన్నాయి. కార్యకర్తలపై టీడీపీ నేతలు వ్యవహరిస్తున్న నిర్లక్ష్యపు ధోరణికి విసుగు చెంది వైఎస్సార్‌సీపీలో చేరినట్లు వారు తెలిపారు. త్వరలో మరిన్ని కుటుంబాలు చేరుతాయన్నారు. కార్యక్రమంలో పంచాయతీ ఉప సర్పంచ్ పైడి నర్సింహప్పారావు, గొండు రామకృష్ణ, పైడి చలపతిరావు, సువ్వారి అన్నంనాయుడు, గండెం రాము తదితరులు పాల్గొన్నారు.

నాగావళిలో మునిగి విద్యార్థి మృతి



దుర్గాప్రసాదు మృతదేహం



సరుబుజ్జిలి: బూర్జ మండలంలోని లాభాం వద్ద నాగావళి నదిలో ప్రమాదవశాత్తు మునిగి ఇంటర్మీడియట్ విద్యార్థి సాసుపల్లి దుర్గాప్రసాదు(19) ఆదివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ మండలం బెల్లంకి వీధికి చెందిన దుర్గాప్రసాద్ తన స్నేహితులు ఐదుగురితో కలిసి లాభాం గ్రామం వద్ద నాగావళి నదిలో స్నానానికి దిగాడు. అయితే అతను లోతులో చిక్కుకుపోయి ఈతరాక మునిగిపోయినట్లు స్నేహితులు తెలిపారు. కాపాడే ప్రయత్నం చేసినా విఫలం కావడంతో సమీపంలో ఉన్న లాభాం గ్రామస్తులకు యువకులు సమాచారం అందించారు. అయితే అప్పటికే యువకుడు చనిపోయాడు. దుర్గాప్రసాదు పాలకొండ తమ్మినాయుడు జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. మృతుడికు తండ్రి రాము, తల్లి భారతి, చెల్లి ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం.ప్రవల్లిక వెల్లడించారు.

ట్రాఫిక్ ఆంక్షలతో ఇబ్బందులు



ట్రాఫిక్ నిలుపుదల చేయడంతో మిల్లు జంక్షన్‌లో బారులుతీరిన వాహనదారులు

శ్రీకాకుళం: జిల్లాకు హోంమంత్రి అనిత ఆదివారం విచ్చేసిన నేపథ్యంలో నగరంలో పోలీసులు అమలు చేసిన ట్రాఫిక్ ఆంక్షలు ప్రజలను ఇబ్బందులకు గురి చేశాయి. హోం మంత్రి అరసవల్లి సూర్యనారాయణ స్వామి దర్శనానికి వచ్చినప్పుడు మిల్లు జంక్షన్‌లో 15 నిమిషాలకు పైగా ట్రాఫిక్‌ను నిలుపుదల చేశారు. ఇలా ఆమె ప్రయాణించిన మార్గాల్లో 10 నుంచి 15 నిమిషాల పాటు రాకపోకలను నిలుపుదల చేశారు. దీంతో తీవ్రమైన ఎండకు తట్టుకోలేక వాహనదారులు విలవిలలాడారు.

కన్ను మూసిన బొలొంగా బాలిక

- ఎవరి ప్రమేయం లేదు: పోలీసులు
- భగ్గుమన్న విపక్షాలు



ఎయిమ్స్ ఆవరణలో బాలిక మృత దేహం

భువనేశ్వర్: అగ్ని మంటల్లో గాయపడి మృత్యు పోరాటం చేసిన బాలిక శని వారం రాత్రి కన్ను మూసింది. ధ్రువీకరణకు నోచుకోని సందిగ్ధ అగ్ని ప్రమాదంలో ఈ బాలిక శరీరం చాలావరకు కాలిపోయింది. గత నెల 19న పూరీ జిల్లా నిమాపడా నియోజక వర్గం పిప్పిలి మండలం బొలొంగా ఠాణా పరిధి బయాబొరొ గ్రామంలో జరిగిన ఈ విషాద సంఘటనలో 15 ఏళ్ల బాలిక ఢిల్లీ ఎయిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచింది.

అయితే బాలిక మంటల్లో ఎలా చిక్కుకుంది? ఎవరు నిప్పు అంటించారు? ఎందుకు అంటించి ఉంటారు? తదితర సందేహాల నడుమ సత్వర చికిత్స కోసం స్థానిక అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ ఎయిమ్స్ నుంచి ఢిల్లీ ఎయిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ప్రత్యేక వైద్య నిపుణుల బృందం ప్రత్యక్ష పర్యవేక్షణలో చికిత్స పొందుతు బాలిక తుది శ్వాస విడిచిన మరు క్షణమే దర్యాప్తు కొనసాగిస్తున్న వర్గం బాలిక మరణంలో ఎవరి ప్రమేయం లేదని ప్రకటించింది. పోలీసుల దిగ్భ్రాంతికర ప్రకటనతో రాష్ట్రంలో పరిస్థితి మరోసారి భగ్గుమంది. విపక్షాలు విరుచుకుపడుతున్నాయి.

ఢిల్లీ ఎయిమ్స్ ట్రామా సెంటర్‌లో ఆమె పోస్టుమార్టం నిర్వహించారు. ఆమె మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించడంతో స్వగ్రామానికి తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. న్యూఢిల్లీలోని రాష్ట్ర ప్రభుత్వ రెసిడెన్షియల్ కమిషనర్ స్వస్థలానికి విమానంలో తరలించే ఏర్పాట్లు ప్రత్యక్షంగా పర్యవేక్షించారు.

ఇంటి ఆవరణలో పోలీసు భద్రత

మృత బాలిక స్వస్థలంలో ఇంటి ఆవరణలో భారీ పోలీసు భద్రత ఏర్పాటు చేశారు. మరో వైపు గ్రామస్తులు బాలిక అంత్యక్రియల కోసం స్మశాన వాటికలో అనుబంధ ఏర్పాట్లు చేయడంలో తలమునకలయ్యారు. గ్రామం పూర్తిగా నిశ్శబ్దమైంది. ఎవరూ బయటకు రావడం లేదని పోలీసు వర్గాల సమాచారం.

చివరి దశలో దర్యాప్తు: పోలీసులు

బొలొంగా ఘటనలో బాలిక మృతిపై రాష్ట్ర పోలీసులు సమగ్ర దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తు చివరి దశకు చేరుకుంది. ఇప్పటి వరకు నిర్వహించిన దర్యాప్తు ప్రకారం, ఈ ఘటనలో మరెవరి ప్రమేయం లేదని స్పష్టమవుతోందని ప్రకటించారు. బాలిక మరణ వార్తతో ఈ విషయాన్ని సోషల్ మీడియాలో రాష్ట్ర పోలీసు శాఖ ప్రసారం చేసింది.

తుంగలో తొక్కేందుకు కుట్ర: కాంగ్రెస్

బాలిక మరణ వార్త ప్రసారం కావడంతో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఒడిశా పోలీసులు, బాలిక తండ్రి వ్యక్తీకరించిన అభిప్రాయాలు మూస పోసినట్లు ఉండడం సంచలనాత్మక సంఘటనని తుంగలో తొక్కే ప్రయత్నంగా తారసపడుతుందని కాంగ్రెస్ నాయకురాలు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక కాంగ్రెస్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆదివారం ఆమె మాట్లాడారు. ఈ విచారకర సంఘటన జరిగి 384 గంటలు గడిచాయని, దోషి ఎవరో ఇంత వరకు గుర్తించ లేదన్నారు. ప్రభుత్వం ఈ కేసును అణిచివేయడానికి ప్రయత్నిస్తోందని సోనాలి సాహు బాహాటంగా ఆరోపించారు. ఈ కేసులో ప్రమేయం ఉన్న ముగ్గురు నిందితులను 7 రోజుల్లోగా డీజీపీ అరెస్టు చేయకపోతే, డీజీపీ కార్యాలయాన్ని చుట్టుముడతామని కాంగ్రెస్ హెచ్చరించింది.

నిప్పు మంటలతో గాయపడి ఎయిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధిత బాలిక వాంగ్మూలం పలుమార్లు నమోదు చేశారు. ఇటీవల రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడా ప్రత్యక్షంగా సందర్శించి బాలిక క్రమంగా కోలుకుంటుందని ప్రకటించారు. ఇంతలో బాలిక కన్ను మూసిందనే వార్త ప్రసారం కావడం దురదృష్టకరం. ముగ్గురు గుర్తు తెలియని దుండగులు కిరసనాయిలు పోసి బాలికకు నిప్పు అంటించినట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసు బృందం అకస్మాతుగా ఈ సంఘటనతో ఎవరి ప్రమేయం లేదని ప్రకటించడం పకడ్బందీ వ్యూహాత్మక హత్యా సంఘటనగా ప్రేరేపిస్తుందని రాష్ట్ర కాంగ్రెస్ ప్రతినిధి సోనాలి సాహు ఆరోపించారు.

దయచేసి రాజకీయం చేయొద్దు: తండ్రి



తన బిడ్డ దురదృష్టకర మరణానికి మేము ఎవరినీ నిందించాలనుకోవడం లేదు. దయచేసి రాజకీయం చేయొద్దని మృత బాలిక తండ్రి అభ్యర్థించాడు. ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేశారని, తాము ఎవరినీ బాధ్యులుగా భావించడం లేదని తెలిపారు.

దర్యాప్తు ముగియకుండా తీర్మానం సందిగ్ధం: డాక్టర్ సస్మిత్ పాత్రో



పూరీ జిల్లాలో నిప్పు మంటల్లో చిక్కుకున్న బాధిత బాలిక మరణించడం విషాదకరం. ఈ విచారకర సంఘటన పురస్కరించుకుని స్థానిక పోలీసు ఠాణాలో దాఖలు అయిన ఎఫ్ఐఆర్‌లో ముగ్గురు దుండగుల పేర్లు నమోదయ్యాయి. పోలీసుల ఈ ప్రకటన రాష్ట్రంలో మహిళలకు ఎలాంటి సందేశాన్ని అందిస్తుందని రాజ్య సభ సభ్యుడు, బిజూ జనతా దళ్ జాతీయ అధికార ప్రతినిధి డాక్టర్ సస్మిత్ పాత్రో మండిపడ్డారు.



విలేకర్ల సమావేశంలో సోనాలి సాహు

వెండి సర్పం బహూకరణ

రాయగడ: స్థానిక వ్యాపారవేత్త ఈశ్వరరావు గొపాల శెఠి బ్రాహ్మణ వీధి సమీపంలో గల పీహెచ్‌డీ కొండపై కొలువై ఉన్న బాలింకేశ్వర మందిరానికి సుమారు రూ.2.60 లక్షల విలువ చేసే వెండి సర్పం, వెండి ధార పాత్రను బహూకరించారు. ఈ సందర్భంగా ఆదివారం మందిరంలో ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు ప్రదీప్ కుమార్ రణా, రాజీవ్ రోహితులు బిరంచి నారాయణ దాస్‌కు వెండి వస్తువులు అందజేశారు. సుమారు 1.700 కిలోల వెండితో వాటిని రూపొందించినట్లు శెఠి తెలియజేశారు.



బాలింకేశ్వర మందిరంలో పూజలు అందుకుంటున్న వెండి సర్పం, ధార పాత్ర

భానుడు భగభగ

పర్లాకిమిడి: పర్లాకిమిడిలో ఎండలు మండిపోతున్నాయి. వారం రోజులుగా ఎండలు భగభగ మండిపోతుండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఆదివారం ఉదయం 11 గంటలకు 35 డిగ్రీలసెంటీగ్రేడ్ నమోదైంది. ఉక్కపోత, తీవ్రమైన ఎండలకు ప్రజలు చెమటతో బాధపడ్డారు. ఎండకుతోడు పవర్‌కట్ తోడు కావడంతో మరింత ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరో రెండు రోజుల పాటు వాతావరణం ఉక్కపోతతో ఉంటుందని ఐఎండీ తెలిపారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



జయపురం: మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



పర్లాకిమిడి: గజపతి స్టేడియంలో మొక్కలు నాటుతున్న బీజేపీ శ్రేణులు

జయపురం: తల్లి పేరున ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని స్థానిక పీఎంశ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం ప్రకాశ్ చంద్ర పట్నాయక్ అన్నారు. పాఠశాలలో శనివారం మొక్కలు నాటారు. బ్లాక్ విద్యాధికారి చందన నాయక్ ముఖ్యఅతిథిగా పాల్గొని మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. తల్లి మనకు జన్మనిచ్చిందని, చెట్లు మన మనుగడకు ఆధారమన్నారు. మొక్కలు నాటి జీవ రాశి మనుగడకు, పర్యావరణ పరిరక్షణకు దోహదపడాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



జయపురం: మొక్కలు నాటే కార్యక్రమంలో ఎకో క్లబ్ విద్యార్థినులు

అటల్ యువ వాహినీ ఆధ్వర్యంలో..

పర్లాకిమిడి: బీజేపీ శ్రేణులు అటల్ యువ వాహినీ వింగ్‌ను ఆదివారం ఏర్పాటు చేశారు. స్థానిక గజపతి స్టేడియంలో అటల్ యువవాహిని ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమంతో మొదలు పెట్టారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కాశీనగర్ సీనియర్ నాయకులు ఛిత్రి సింహాద్రి, రొక్కం రాం ప్రసాద్, యువ మోర్చా నాయకులు కోట్ల యువ రాజ్, దారపు చిట్టిబాబు, కృషక్ మోర్చా జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ పాలో, మహిళా మోర్చా అధ్యక్షురాలు అరుణిమా సాహు, కుమార్, సిద్ధేశ్వర మిశ్రా తదితరులు పాల్గొన్నారు.



జయపురం: మొక్కలు నాటుతున్న అధికారులు, ఉపాధ్యాయులు



జయపురం: మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు



పర్లాకిమిడి: మొక్కలు నాటుతున్న అటల్ యువవాహినీ ప్రతినిధులు

7న సురేఖ పాణిగ్రాహి సంతాప సభ

పలాస: మండలంలోని బొడ్డపాడులో ఈనెల 7వ తేదీన ఉదయం 10 గంటలకు ప్రముఖ విప్లవ కవి, శ్రీకాకుళం గిరిజన రైతాంగ సాయుధ పోరాట యోధుడు సుబ్బారావు పాణిగ్రాహి సతీమణి సురేఖ పాణిగ్రాహి సంతాప సభ నిర్వహించనున్నట్లు సంతాప సభ నిర్వహణ కమిటీ ప్రతినిధులు, గ్రామస్తులు తెలియజేశారు. ఈ మేరకు సంతాప సభ కరపత్రాలు, వాల్ పోస్టర్లు బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరం వద్ద ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సురేఖ పాణిగ్రాహి సంతాప సభ నిర్వహించుకోవడమంటే ఆనాటి శ్రీకాకుళం పోరాటాలు, ఆ పోరాటంలో అమరుల త్యాగాలను గుర్తు చేసుకోవడమేనన్నారు. కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అమరుల బంధుమిత్రుల కమిటీ నాయకులు పాల్గొన్నారు.

సమాజ చైతన్యంలో మీడియాది గురుతర బాధ్యత



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే బాహిణీపతి, తదితరులు

జయపురం: సమాజాన్ని చైతన్యపరచటంలో పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధుల భూమిక గురుతరమైనదని జయపురం ఎం.ఎల్.ఎ తారాప్రసాద్ బాహిణీపతి అన్నారు. ఆదివారం స్థానిక హోటల్ సభాగృహంలో జరిగిన ఒడిశా రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు అసోసియేషన్ రాష్ట్ర స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎమ్మెల్యే బాహిణీపతి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో జర్నలిజం నాల్గో స్తంభం అని, నాలుగు స్తంభాలలో ఏ ఒక్క స్తంభం లేక పోయినా ప్రజాస్వామ్య వ్యవస్థ మనుగడ సాధించలేదన్నారు. మన సమాజంలో జర్నలిస్టులకు తగిన గుర్తింపు లేదని, ముఖ్యంగా పాలకులు వారికి ఎటువంటి సౌకర్యాలు, రక్షణ కల్పించటం లేదన్నారు. జర్నలిస్టులపై సంఘ వ్యతిరేకులు దాడులు జరుపుతున్నా పాలకులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. జర్నలిస్టుల రక్షణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు పెన్షన్ కల్పించాలని, ఆరోగ్య బీమా పథకం వారి కుటుంబ సభ్యులందరికీ వర్తింపజేయాలని, ఎంతో కాలంగా వారు డిమాండ్ చేస్తున్నారని, అయినా ప్రభుత్వాలు పట్టించుకోవటంలేదని దుయ్యబట్టారు. తాను జర్నలిస్టుల సమస్యలపై విధాన సభలో ప్రభుత్వాన్ని నిలదీస్తూ వస్తున్నానని ఆయన వెల్లడించారు. జర్నలిస్టుల డిమాండ్‌లు నేరవేరే అంతవరకు తాను ప్రభుత్వంతో పోరాడుతానని స్పష్టం చేశారు. రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సత్యజిత్ రాయ్ చౌదరి.. జర్నలిస్టుల ఇబ్బందులు, వారి డిమాండ్లపై ప్రసంగించారు. రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లో జర్నలిస్టు భవనం నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఈ సమావేశంలో కొరాపుట్ కేంద్ర సహకార బ్యాంక్ పాలన కమిటీ అధ్యక్షుడు ఈశ్వర చంద్ర పాణిగ్రహి, జయపురం మునిసిపాలిటీ చైర్మన్ నరేంద్ర కుమార్ మహంతి, ప్రముఖ వ్యాపారి సంజయ జైన్, అసోసియేషన్ సాధారణ కార్యదర్శి నిరంజన్ బిశ్వాల్, రాష్ట్ర కార్యదర్శి నారాయణ ప్రసాద్ మిశ్ర, రాష్ట్ర సహాయ కార్యదర్శి మాట్లాడారు. ఈ రాష్ట్ర స్థాయి సమావేశంలో జర్నలిస్టులకు పెన్షన్, జర్నలిస్టుల కుటుంబ సభ్యులందరికీ బీమా పథకం, రక్షణ చట్టం అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ తీర్మానం చేసింది. ఈ సమావేశంలో రాష్ట్రంలోని 30 జిల్లాల నుంచి 140 మంది పాత్రికేయులు, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

స్నేహమే శాశ్వతం

రాయగడ: స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక స్వాగత్ లైన్‌లోని శ్రీరామలింగేశ్వర ఆలయం ప్రాంగణంలో స్పందన సాహితీ, సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. సంస్థ ప్రధాన కార్యదర్శి పతివాడ తులసీ దాస్, సాంస్కృతిక విభాగం కార్యదర్శి కేకేఎం పట్నాయక్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కళాకారులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు. స్నేహమంటే పాలు, నీళ్లలా కలిసి పోవాలని వక్తలు పేర్కొన్నారు. పాలలాంటి స్వచ్ఛమైనది కేవలం స్నేహం మాత్రమేనని కవి భళ్లమూడి నాగరాజు అన్నారు. ఈ సందర్భంగా గాయనీ, గాయకులు పాడిన పాటలు ప్రేక్షకులను అలరించాయి. విశ్రాంత అధ్యాపకులు శివకేశరరావు, గిరీష్ పట్నాయక్ పాల్గొన్నారు.



పాటలు పాడుతున్న గాయకులు వేదికపై కేకేఎం పట్నాయక్, పతివాడ

సందడిగా ఫ్రెండ్‌షిప్ డే

పర్లాకిమిడి: స్థానిక 14వ వార్డు సంజయ్ గాంధీ కాలనీ వాసులతో బృందవన్ ప్యాలస్‌లో స్నేహితుల దినోత్సవాన్ని ఆదివారం సందడిగా నిర్వహించారు. ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి కేక్ కట్ చేశారు. సంజయ్ గాంధీ కాలనీ యువకులకు అభినందనలు తెలిపారు. ఈ ఉత్సవంలో బీజేడీ ఛత్ర సంఘం నాయకుడు, కౌన్సిలర్ బిశ్వజిత్ త్రిపాఠి, తదితరులు పాల్గొన్నారు.



సంజయ్‌గాంధీ కాలనీ యువకులతో బి.ఎస్.ప్యాలస్‌కు బంధుత్వ దివాస్‌ను నిర్వహించడానికి వెళ్తున్న ఎమ్మెల్యే



బృందావన్ ప్యాలస్‌లో ఎమ్మెల్యే బంధుత్వ దివాస్ పాలన



పవిత్ర జలాలు తెచ్చేందుకు వెళ్తున్న సతిగుడ నదికి వెళ్తున్న చిన్నారులు

బోల్‌భం భక్తుల సందడి

జయపురం: శ్రావణ ఆదివారం సందర్భంగా బోల్‌భం భక్తులు సందడి చేశారు. కావిడి భుజాల నేత్తుకొని మహాశివునికి పవిత్ర జలాలతో ప్రసిద్ధ శివక్షేత్రం గుప్తేశ్వర్ నడుచుకుంటూ వెళ్లారు. చిన్న పిల్లలు సుమారు 65 కిలోమీటర్లు నడిచి గుప్తేశ్వర్ వెళ్లలేరు. అందుకు జయపురం పవర్ హౌస్ కాలనీలో చిన్న పిల్లలు అందరూ ఫవర్ హౌస్‌లోని శివునికి జలాభిషేకం చేసి పూజలు చేశారు. పవిత్ర స్నానాలు చేసి శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు.



కావిడితో చిన్నారి భక్తురాలు

భువనేశ్వర్-కొరాపుట్ మధ్య

పగటి వేళ ప్రత్యేక రైలు నడపాలి

జయపురం: భువనేశ్వర్- కోరాపుట్ మధ్య పగటి వేళ ప్రత్యేక రైలు నడపాలని కొరాపుట్ బీజేపీ ఎమ్మెల్యే రఘురాం మచ్చ కోరారు. ఈమే కేంద్ర రైల్వే మంత్రి అశ్విణీవైష్ణవ్‌ను శనివారం ఢిల్లీలో కలిసి వినతిపత్రం అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో ఎమ్మెల్యేతో పాటు కొరాపుట్ బీజేపీ నేత కాళీరాం మఝి ఉన్నారు. జయపురం-నవరంగపూర్, జయపురం-మల్కనగిరి, గుణుపూర్-తెరువల్లి రైల్వే పనులపై కూడా కేంద్రమంత్రితో చర్చించారు.



రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే రఘునాథ్ మచ్చ, కాళీరాం

క్లుప్తంగా

పట్టుబడిన పీడీఎస్ బియ్యం



పోలీసులకు పట్టుబడిన బియ్యం, ఆటో

వేపాడ: మండలంలోని వల్లంపూడి సమీపంలో ఆటోలో రవాణా చేస్తున్న పీడీఎస్ బియ్యాన్ని వల్లంపూడి పోలీసులు పట్టుకున్నట్లు ఎస్సై సుదర్శన్ ఆదివారం తెలిపారు. పట్టుబడిన బియ్యం, వాహనం స్టేషన్‌లో ఉంచామని సోమవారం రెవెన్యూ అధికారులకు అప్పగించనున్నట్లు ఎస్సై చెప్పారు. పట్టుబడిన బియ్యం సుమారు 350 కేజీలు ఉంటాయన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటాలి

- పారా స్పోర్ట్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు దయానంద్



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

విజయనగరం: పారా జూనియర్, సబ్ జూనియర్స్ అథ్లెటిక్స్ జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు అక్కడ కూడా సత్తా చాటాలని పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు కె.దయానంద్ అన్నారు. ఈ మేరకు ఆదివారం విజయనగరంలో గల సారథి వెల్ఫేర్ అసోసియేషన్ బ్లైండ్ స్కూల్‌లో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా స్థాయి పోటీల్లో ఉమ్మడి విజయనగరం జిల్లా నుంచి 135 మంది పారా క్రీడాకారులు పాల్గొన్నారని, వారిలో 47 మంది అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం అభినందనీయమన్నారు. పాతవారితో పాటు మొదటిసారి పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు కూడా అత్యుత్తమ ప్రతిభ కనబరచడం ఆనందంగా ఉందన్నారు. ఇదే స్ఫూర్తితో ఈనెల 9 న విశాఖపట్నంలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా సత్తా చాటి జిల్లాకు పేరు తీసుకురావాలని, అలాగే హర్యానాలో జరగబోయే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని కోరారు. అనంతరం రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో సారథి వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు ప్రదీప్, అమ్మ సేవా సంఘం వ్యవస్థాపకుడు లక్కీ శేఖర్, మహేష్, కిరణ్ కుమార్, శర్మ, వెంకటరావు, పారా క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

5న సబ్ జూనియర్స్ జూడో క్రీడాకారుల ఎంపిక

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న సబ్ జూనియర్స్ జూడో పోటీలకు హాజరయ్యేందుకు విజయనగరం జిల్లా జూడో క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈనెల 5న నిర్వహించనున్నట్లు జిల్లా జూడో అసోసియేషన్ కో ఆర్డినేటర్ జామి నారాయణరావు తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం 2 గంటలకు బాబామెట్టలోని దేవి పార్కులో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 2011వ సంవత్సరం నుంచి 2013వ సంవత్సరం మధ్య జన్మించిన క్రీడాకారులు ఎంపిక పోటీల్లో పాల్గొనేందుకు అర్హులుగా తెలిపారు. ఎంపికపోటీల్లో పాల్గొనబోయే క్రీడాకారులు విధిగా తమ జనన ధ్రువీకరణ పత్రంతో పాటు ఆధార్ కార్డు వెంట తీసుకురావాలని సూచించారు. బాలుర విభాగంలో 30 కేజీలు, 35 కేజీలు, 40, 45, 50, 55, 60, 65 కేజీల విభాగాల్లో ఎంపిక పోటీలు ఉంటాయన్నారు. అదేవిధంగా బాలికల విభాగంలో 28, 32, 36, 40, 44, 48, 52, 57 కేజీలు ఆపై బరువు కలిగిన విభాగాల్లో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు ఫోన్ 8142552721 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

విజృంభిస్తున్న విష జ్వరాలు

చీపురుపల్లి: పట్టణంతో పాటు పల్లెల్లో కూడా విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. ప్రతీ గ్రామంలోనూ ప్రజలు జ్వరాలతో మంచాన పడుతున్నారు. ఎప్పు డు ఏం జరుగుతుందోనని భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. జ్వరాలు బారిన పడుతు న్న వారు సమీపంలోని ఆర్‌ఎంపీల ద్వారా స్వంత డబ్బులు వెచ్చించి వైద్యం చేయించుకుంటున్నారు. మండలంలోని విశ్వనాథపురంలో ఐదేళ్ల బాలిక జ్వరంతో మృత్యువాత పడడంతో సర్వత్రా భయాందోళనలు నెలకొన్నాయి. ఈ పరిస్థితుల్లో వైద్య ఆరోగ్య శాఖ నుంచి ఎలాంటి ముందస్తు జాగ్రత్త చర్యలు కాని, జ్వరాలు వచ్చిన తరువాత పంపిణీ చేయాల్సిన మందులు విషయంలో సైతం ఎక్కడా వారు కనిపించకపోవడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

అకస్మాత్తుగా...

మండలంలోని అలజంగి పంచాయతీ మధురా గ్రామమైన విశ్వనాథపురం గ్రామానికి చెందిన దన్నాన జాస్మిన్(5) అనే బాలిక వింత జ్వరంతో ఆదివారం మృతి చెందింది. రామప్పడు, నాగమణి దంపతులకు చెందిన జాస్మిన్ గత మూడు రోజుల నుంచి జ్వరంతో బాధపడుతోంది. స్థానికంగా ఆర్‌ఎంపీలు వద్ద వైద్యం చేయించారు. పరిస్థితి విషమించడంతో ఆదివారం ఉదయం ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. దీంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

సగమే సెక్యూరిటీ..!

- ఎంఓయూ జరిగి రెండు నెలలైనా పూర్తిస్థాయిలో జరగని గార్డుల నియామకం
- 58 మందిసెక్యూరిటీ గార్డులకు విధుల్లో 23 మంది
- సెక్యూరిటీ పూర్తిస్థాయిలో లేక కానరాని భద్రత



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటు కావడంతో జిల్లా ఆస్పత్రి ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిగా మారింది. దీంతో ఆస్పత్రిలో వైద్యసిబ్బందితో పాటు, వసతులు కూడా పెరిగాయి. ఈ క్రమంలో ఓపీ సంఖ్య పెరిగింది. అయితే ఆస్పత్రికి, రోగులు, వైద్యసిబ్బందికి భద్రత మాత్రం పూర్తి స్థాయిలో లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సర్వజన ఆస్పత్రికి నిబంధన ప్రకారం ఉండాల్సిన సెక్యూరిటీ గార్డుల్లో సగం సిబ్బంది మాత్రమే ఉన్నారు. దీంతో వారు ఆస్పత్రి అంతటికీ భద్రత కల్పించలేక పోతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కూటమి సర్కార్ వచ్చిన తర్వాత సెక్యూరిటీ ఏజెన్సీని కూడా మార్చేసింది. గతంలో కాటలాండ్ సెక్యూరిటీ ఏజెన్సీవారు బాధ్యతలు నిర్వహించేవారు. కూటమి సర్కార్ ఆ ఏజెన్సీని తప్పించి శ్రీ కార్తికేయ ఏజెన్సీకి బాధ్యతలు అప్పగించింది.

58మంది సెక్యూరిటీ గార్డులకు ఎంఓయూ

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి నూతన నిబంధన ప్రకారం 58మంది సెక్యూరిటీ గార్డులు ఉండాలని సర్వజన ఆస్పత్రి వైద్యాధికారులు సెక్యూరిటీ ఏజెన్సీతో ఎంఓయూ చేసుకున్నారు. అగ్రిమెంట్ మే నెలలో జరిగింది. జూన్ నెల 1వతేదీ నుంచి 58 మంది సెక్యూరిటీ గార్డులను సెక్యూరిటీ ఏజెన్సీ సరఫరా చేయాల్సి ఉంది. అగ్రిమెంట్ జరిగి రెండు నెలలు కావస్తున్నా ఇంతవరకు పూర్తిస్థాయిలో సెక్యూరిటీ గార్డులను సరఫరా చేయలేదు. ప్రస్తుతం ఆస్పత్రిలో 23 మంది సెక్యూరిటీ గార్డులు, ఇద్దరు సెక్యూరిటీ సూపర్‌వైజర్స్ విధులు నిర్వర్తిస్తున్నారు.

గార్డులను సరఫరా చేయక పోవడం వెనుక..

జూన్ ఒకటో తేదీ నుంచి సెక్యూరిటీ గార్డులు పూర్తిస్థాయిలో ఆస్పత్రిలో పనిచేయాల్సి ఉంది. అయినప్పటికీ సగం మందితో పనిచేయిస్తున్నారు. దీని వెనుక మతలబు ఏమిటనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. తక్కువ మందితో పనిచేసినప్పటికీ పూర్తిస్థాయిలో సెక్యూరిటీ గార్డులు పనిచేస్తున్నట్లు చూపించి నిధులు కొట్టేయడానికే ప్లాన్ చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సగం మందితో పనిచేయించడం వల్ల నెలకు రూ.లక్షల్లో మిగులుతుంది. ఈ ఉద్దేశంతో పూర్తిస్థాయి సిబ్బందిని నియమించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.



సర్వజన ఆస్పత్రిలో విధులు నిర్వర్తిస్తున్న సెక్యూరిటీ గార్డులు

ఒకటి రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో గార్డులు

సర్వజన ఆస్పత్రి సెక్యూరిటీ నిర్వహణ శ్రీ కార్తికేయ సెక్యూరిటీ ఏజెన్సీకి వచ్చింది. మే నెలలో ఎంఓయూ జరిగింది. జూన్ ఒకటో తేదీ నుంచి 58 మంది సెక్యూరిటీ గార్డులతో పనిచేయించాలని ఎంఓయూ జరిగింది. ప్రస్తుతం 23 మంది గార్డులు, ఇద్దరు సూపర్‌వైజర్లు పనిచేస్తున్నారు. ఒకటి, రెండు రోజుల్లో పూర్తిస్థాయి సెక్యూరిటీ గార్డులను సరఫరా చేస్తామని ఏజెన్సీ నిర్వాహకులు తెలిపారు.

డాక్టర్ శంబంగి అప్పలనాయుడు, సూపరింటెండెంట్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

జాతీయ రహదారిపై లారీ బీభత్సం

- 3 బైకులు, రెండు ఆటోలు, ఒక బొలెరో వ్యాన్ ధ్వంసం
- ప్రాణహాని జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్న స్థానికులు

రామభద్రపురం: మండలంలోని ఆరికతోట వద్ద జాతీయ రహదారిపై ఓ లారీ బీభత్సం సృష్టించింది. ఆదివారం జరిగిన ఈ ఘటనపై స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం నుంచి ఒడిశా వెళ్తున్న ఓ లారీని ఆరికతోట వద్ద డ్రైవర్ రోడ్డు పక్కన ఆపి టిఫిన్‌కు వెళ్లాడు. లారీకి బ్రేకులు ఫెయిలయ్యాయో ఏమో గానీ సడన్‌గా లారీ ముందుకు వెళ్లి ఎదురుగా ఆగి ఉన్న 3 బైకులు, రెండు ఆటోలు, ఒక బొలెరో వ్యాన్‌ను ఢీ కొట్టుకుంటూ దూసుకెళ్లి రహదారి పక్కన ఉన్న ఓ ఆటోను ఢీ కొట్టి ఆగింది. ముందుగా మొక్కజొన్న కంకుల లోడు కోసం ఆగి ఉన్న బొలెరో వ్యాన్‌ను ఢీ కొనడంతో ఆ వ్యాన్ పక్కన ఉన్న గోతిలో పడింది. అలాగా టిఫిన్ కొట్టు ముందు ఆగి ఉన్న ఆటోను ఒక్క సారిగా ఢీ కొనడంతో ఆ ఆటో టిఫిన్ కొట్టులోకి వెళ్లి దుకాణంలో ఉన్న సామగ్రి ధ్వంసం చేసింది. తర్వాత మరికొంత దూరంలో ఉన్న మూడు ద్విచక్రవాహనాలను ఢీ కొట్టడంతో ఒక బైక్ నుజ్జు నుజ్జవగా మరో రెండు బైక్‌లు లారీ కింద చక్రాల మధ్య ఇరుక్కుపోయి పూర్తిగి ధ్వంసమయ్యాయి. ఈ ప్రమాదంలో మండల పరిధిలోని ఆరికతోట యజ్జల భాస్కరరావుకు చెందిన ఆటోతో పాటు టీ దుకాణంలో ఉన్న సామగ్రి పూర్తిగా ధ్వంసమయ్యాయి. అలాగే ఇదే దుప్పలపూడి గ్రామానికి చెందిన చిప్పాడ రవితో పాటు మరో ఇద్దరి ద్విచక్రవాహనాలు నుజ్జు నుజ్జయ్యాయి. అయితే అదృష్టవశాత్తు ఈ రోడ్డు ప్రమాదంలో ఏ విధమైన ప్రాణ నష్టం, ఏ ఒక్కరికీ చిన్న గాయం కూడా జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. లారీ బీభత్సంపై బాధితులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై వి.ప్రసాదరావు సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



దుకాణాల ముందు నుజ్జు నుజ్జయిన ద్విచక్రవాహనం



బీభత్సం సృష్టించిన లారీ



కొబ్బరి బొండాలతో టీ దుకాణంలో బోల్తాపడిన ఆటో



లారీ చక్రాల కింద పడి ధ్వంసమైన ద్విచక్రవాహనాలు



గుంతలో పడిన బొలెరో వ్యాన్

గిరిజన రైతులకు పట్టాలివ్వాలి



గిరిజన రైతులతో కలిసి ధర్నా చేస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, బలస శ్రీను

- సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ

రామభద్రపురం: గిరిజన రైతులు సాగు చేసిన భూములకు పట్టాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు రామభద్రపురం మండలంలోని కాకర్లవలస, కారేడువలస గిరిజన రైతుల సాగు భూములను దౌర్జన్యంగా లాక్కోవడాన్ని తీవ్రంగా ఖండిస్తూ కాకర్లవలస గ్రామంలో గిరిజన రైతులతో కలిసి ఆదివారం ఆయన ధర్నా చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి ఎటువంటి సమాచారం లేకుండా గిరిజనుల భూములు అక్రమంగా లాక్కోవడం చట్ట విరుద్ధమన్నారు. కాకర్లవలస, కారేడువలస గిరిజన రైతుల సాగు భూములను అక్రమంగా స్వాధీనం చేసుకోవడానికి ఎవరు వచ్చినా సహించేది లేదన్నారు.అధికార బలంతో గిరిజనులపై దౌర్జన్య కాండను ఆపకుంటే వామపక్షాలన్నీ ఏకమై గిరిజనుల పక్షాన పోరాటాలు ఉధృతం చేస్తాయని హెచ్చరించారు. గిరిజన రైతులు ఆరుగాలం కష్టపడి సాగు చేసిన మామిడితోటలు, జీడితోటలు, మొక్కజొన్న పంటలను ధ్వంసం చేసిన ఏపీఐఐసీ అధికారులు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకుడు బలస శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గంజాయి నియంత్రణే లక్ష్యంగా తనిఖీలు

- ఏడున్నర కేజీల గంజాయి లభ్యం

విజయనగరం క్రైమ్: గంజాయి అక్రమ రవాణా నియంత్రణే లక్ష్యంగా ట్రైన్‌లో లోకల్ పోలీసులు, జీఆర్పీ, ఈగల్, ఆర్పీఎఫ్ సిబ్బంది డాగ్ స్క్వాడ్‌తో సంయుక్తంగా ఆకస్మిక తనిఖీలు చేపట్టినట్లు ఎస్పీ వకుల్ జిందల్ ఆదివారం చెప్పారు. రాష్ట్ర డీజీపీ ఆదేశాలతో గంజాయి అక్రమ రవాణాను నియంత్రించేందుకు ఐదు పోలీసు బృందాలు సంయుక్తంగా కిరండోల్ పాసింజర్ ట్రైన్‌లో శనివారం రాత్రి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారన్నారు. ఒడిశా రాష్ట్రం నుంచి ఇతర ప్రాంతాలకు గంజాయి అక్రమంగా రవాణా అవుతోందన్న సమాచారంతో ప్రత్యేకంగా రైళ్లలో తనిఖీలు చేపట్టామన్నారు. ఈ సందర్భంగా విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, ఎస్.కోట సీఐ వి.నారాయణమూర్తిలు ముందుగా ప్రయాణికులకు చేస్తున్న తనిఖీల గురించి వివరించి, వారు నిర్వర్తించే విధుల గురించి దిశానిర్దేశం చేశారన్నారు. అన్ని భోగీల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టి, నార్కోటిక్ డాగ్ స్క్వాడ్ సహాయంతో క్షుణ్ణంగా పరిశీలించామన్నారు. ఈ ఆకస్మిక తనిఖీల్లో ఆరు కిలోల గంజాయి, ఒక వ్యక్తి నుంచి కిలోన్నర గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగం గురించి సమాచారాన్ని టోల్ ఫ్రీ నంబరు 1972కుఅందించాలని ఎస్పీ వకుల్ జిందల్ ప్రజలను కోరారు. ఈ తనిఖీల్లో వల్లంపూడి ఎస్సై ఎస్.సుదర్శన్ ఆర్పీఎఫ్ ఎస్సై పి.శ్రీనివాసరావు డాగ్ స్క్వాడ్ సిబ్బంది, ఈగల్ టీమ్ పోలీసులు, 40మంది పోలీసు అధికారులు ఇతర సభ్యులు పాల్గొన్నారు.



రైళ్లలో సంయుక్తంగా తనిఖీలు చేస్తున్న ఐదు విభాగాల పోలీసులు

రైలులో గంజాయి అక్రమ రవాణా

- జీఆర్పీకి చిక్కిన పల్నాడు వాసి

విశాఖ నుంచి కిరండోల్ వెళ్తున్న ప్యాసింజర్ ట్రైన్‌లో గంజాయి అక్రమ రవాణాను గవర్నమెంట్ రైల్వే పోలీసులు ఆదివారం అడ్డుకున్నారు. జీఆర్పీ ఎస్సై బాలాజీ రావు తన సిబ్బందితో కలిసి కిరండోల్ రైలులో సోదాలు చేస్తుండగా ఓ వ్యక్తి కొత్తవలసలో రైలు దిగి పారిపోతూ అడ్డంగా దొరికిపోయాడు. పల్నాడు జిల్లా వినుకొండ మండలం ముందలమూరివారిపాలానికి చెందిన తన్నేరు ఏసుబాబు ఒడిశాలో కొనుగోలు చేసి బెంగళూరుకు 1.133కేజీల గంజాయిని తరలిస్తూ చిక్కాడని ఎస్సై బాలాజీ రావు తెలిపారు. ఈ మేరకు నిందితుడు ఏసుబాబుపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి విశాఖ రైల్వే కోర్టులో హాజరు పరిచినట్లు చెప్పారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

- తెలియరాని మృతుడి వివరాలు



కల్వర్టు వద్ద వ్యక్తి మృతదేహం



పార్కింగ్ చేసి ఉన్న ద్విచక్రవాహనం

వేపాడ: వేపాడ–ఆనందపురం ప్రధాన రహదారిలో నీలకంఠరాజపురం వద్ద రైవాడ కాలువ కల్వర్టు సమీపంలో శనివారం అర్ధరాత్రి తర్వాత జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నీలకంఠరాజపురం రైవాడ కాలువ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి అక్కడిక్కడే మృతిచెందాడు. వ్యక్తిని ఢీకొన్న వాహనం, ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి ఆచూకీ లభ్యం కాలేదని సీఐ అప్పలనాయుడు తెలిపారు. ఆదివారం ఉదయం స్థానికులు అందించిన సమాచారం మేరకు సంఘటనా స్థలాన్ని వల్లంపూడి ఎస్సై సుదర్శన్, సీఐ అప్పలనాయుడు సిబ్బంది సందర్శించి ప్రమాదంపై గ్రామస్తులను ఆరాతీశారు. తెల్లవారుజామున 2గంటల నుంచి 4 గంటల మధ్య ప్రమాదం జరిగి ఉండవచ్చని అంచనా వేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతిచెందిన వ్యక్తికి సంబంధించిన స్కూటీ కల్వర్టుగోడ పక్కన ఉందన్నారు. మృతదేహాన్ని ఎస్.కోట ఆస్పత్రికి తరలించామని కుటుంబసభ్యుల ఆచూకీ కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు సీఐ అప్పలనాయుడు తెలిపారు.

బైక్‌తో విద్యుత్ స్తంభాన్ని ఢీకొని వ్యక్తి..

రామభద్రపురం: మండలంలోని కొట్టక్కి, జన్నివలస జంక్షన్ సమీపంలో శనివారం అర్ధరాత్రి ద్విచ్రవాహనంతో విద్యుత్ స్తంభాన్ని ఢీ కొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. దీనిపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..జన్నివలస పంచాయతీ పరిధిలోని నేరళ్లవలస గిరిజన గ్రామానికి చెందిన కుడుమూరు కన్నయ్య దొర (26) పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై రామభద్రపురం మండలకేంద్రానికి వచ్చాడు. పని ముగించుకుని తిరిగి సొంత గ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యంలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీ కొని అక్కడిక్కడే మృతిచెందాడు.ఆదివారం ఉదయం అటువైపు వాకింగ్‌కు వెళ్తున్న కొంతమంది పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై వి.ప్రసాదరావు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద పరిస్థితిని పరిశీలించారు. మృతుడికి భార్య భవాని, పిల్లలు అజిత్ కుమార్, సోను ఉన్నారు. రోజువారీ కూలి పనులు చేసుకుంటూ కుటుంబ పోషణ సాగిస్తున్న ఇంటి పెద్ద దిక్కును కోల్పోవడంతో తల్లి, భార్యాపిల్లలు కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి తరలించి మృతుడి భార్య భవాని ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.



కన్నయ్య దొర మృతదేహం



కన్నయ్య (ఫైల్)

ఎంతో ఎదుగుతావనుకుంటే..!

- తిరిగిరాని లోకానికి వెళ్లిపోయావా నాన్నా..
- మిన్నంటిన తల్లిదండ్రుల రోదనలు
- కంటతడి పెట్టిన గ్రామస్తులు



నారాయణ పురం-లాబాం గ్రామాల మధ్య నది వద్ద దుర్గాప్రసాద్ మతదేహం

పాలకొండ రూరల్: ఇప్పుడే వచ్చేస్తానని చెప్పి..తిరిగిరాని లోకానికి వెళ్లిపోయావా నాన్నా..అంటూ మృతుడి తల్లిదండ్రుల రోదనలు గ్రామస్తులను కంటతడి పెట్టించాయి. భవన నిర్మాణ కార్మికుడైన ఆ తండ్రి తన రెక్కల కష్టంతో పిల్లలను, కుటుంబాన్ని సాకాడు. ఎదుగుతున్న పిల్లలు ఉన్నత చదువులు చదవాలకున్నాడు. భార్య భారతి సహకారంతో పిల్లలకు కష్టం తెలియకుండా కుమార్తె యమున డిగ్రీ, కుమారుడు దుర్గాప్రసాద్(18) ఇంటర్ చదువుతుండడంతో కష్టం మరిచి కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. విధి చిన్న చూపు చూసి వారి ఏకైక కుమారుడిని నాగావళి నది కబళించి ఆ కుటంబంలో తీరని శోకం నింపింది. ఈ ఘటన వివరాల్లోకి వెళ్తే..

పాలకొండ నగరపంచాయతీలోని బల్లంకి వీధిలో నివాసముంటున్న శాసుబిల్లి రాము, భారతి దంపతులకు ఇద్దరు పిల్లలు. భవన నిర్మాణ పనులు చేస్తున్న రాము పిల్లలను చదువులవైపు నడిపించాడు. కుమార్తె డిగ్రీ చదువుతుండగా, కుమారుడు దుర్గాప్రసాద్ స్థానికంగా ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం స్నేహితుల దినోత్సవం కావడంతో మిత్రులతో కలిసి దుర్గాప్రసాద్ బయటకు వెళ్లాడు. అప్పటి వరకూ తమతో కలిసి ఉన్న కుమారుడు స్నేహితులతో ఉన్నాడని భావించిన తల్లిదండ్రులకు మధ్యాహ్నానికి వచ్చిన పిడుగులాంటి వార్త వారు ఉన్నచోట కుప్పకూలేలా చేసింది. ఒక్కసారిగా తల్లిదండ్రులు, ఇతర కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. తమ ఒక్కగానొక్క కుమారుడు ఏడుగురు స్నేహితులతో కలిసి సమీప శ్రీకాకుళం జిల్లా బూర్జ మండలం నారాయణపురం ఆనకట్ట సమీపంలో నాగావళి నది వద్దకు వెళ్లాడని, అక్కడ స్నానం చేసే క్రమంలో దుర్గాప్రసాద్ నదిలో చిక్కుపోవడం, రక్షించే యత్నంలో స్నేహితులు విఫలం కావడంతో సమీపంలో ఉన్న లాబాం గ్రామస్తుల సాయం కోరగా గ్రామస్తులు రక్షించే యత్నం చేస్తున్న క్రమంలో విగతజీవిగా దుర్గాప్రసాద్‌ను నదిలో గుర్తించారని తెలిసి షాక్‌కు గురయ్యామని మృతుడి తండ్రి రాము వాపోయాడు.



దుర్గాప్రసాద్ (ఫైల్)

రూ.200 ఫోన్‌పే చేశాను..

నాన్నా..నేను ఫ్రెండ్స్‌తో కలిసి బయటకు వచ్చానని, బిర్యానీ తినేందుకు రూ.200 కావాలని ఫోన్ చేయడంతో మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో తండ్రి రాము కుమారుడికి ఫోన్ పే చేసి నాన్నా జాగ్రత్త అని చెప్పాడు. త్వరగా ఇంటికి వచ్చేయాలన్నాడు. ఇంతలోనే ఘోరం జరిగిందని మృతుడి తండ్రి రాము చెబుతూ గుండెలవిసేలా రోదించిన తీరు అందరినీ కలిచివేసింది. ఈ ఘటనపై కేసు నమోదు చేశామని మిగిలిన ఏడుగురు స్నేహితులు క్షేమంగా ఉన్నారని బూర్జ ఎస్సై ఎం.ప్రవల్లిక తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు పోలీసులు తరలించారు.

అథ్లెటిక్స్ పోటీలకు జిల్లా క్రీడాకారుల ఎంపిక

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు ఆదివారం పూర్తయ్యాయి. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగర శివారులో గల విజ్జి స్టేడియంలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో ఉమ్మడి విజయనగరం జిల్లా నుంచి సుమారు 600 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వారికి వివిధ విభాగాల్లో పరుగు పోటీలతో పాటు లాంగ్ జంప్, షాట్‌పుట్, హైజంప్, జావెలిన్ త్రో తదితర అంశాల్లో పోటీలు నిర్వహించారు. ఈ ఎంపికలను జిల్లా క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ పి.సీతారామరాజు, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఐవీపీ రాజు ప్రారంభించారు. ఎంపిక పోటీల్లో ఉత్తమ ప్రతిభభ కనబరిచిన క్రీడాకారులను ఈనెల 9,10,11 తేదీల్లో బాపట్ల జిల్లా చీరాల జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పి.లీలాకృష్ణ, కార్యదర్శి శ్రీకాంత్‌లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రతినిధులు, టెక్నికల్ అఫీషియల్స్, సీనియర్ అథ్లెట్‌లు పాల్గొన్నారు.





అథ్లెటిక్స్ ఎంపికపోటీల్లో తలపడుతున్న జిల్లా క్రీడాకారులు